

నేడు సబ్ జూనియర్ నెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

సుభాష్‌నగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): నెట్‌బాల్ సబ్‌జూనియర్ బాలబాలికల ఎంపికలు శుక్రవారం నిర్వహించనున్నట్లు నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్ రమేష్ తెలిపారు. నిజామాబాద్ రూరల్ మండలం తిర్మన్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9గంటల వరకు క్రీడాకారులు బోనాఫైడ్, ఆధార్‌కార్డుతో మైదానంలో ఉండాలని కోరారు. 31-5-2009 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. మిగతా వివరాల కోసం 9440007004 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

భూ భారతిలో రైతుల సమస్యలు పరిష్కారం

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు
- దూదిగాం, సోన్‌పేట్‌లో రెవెన్యూ సదస్సులు



దూదిగాంలో దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

మెండోర, మే8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూభారతి చట్టంలో సాదాబైనామ, పీవోటీ వంటి సమస్యల పరిష్కారానికి వెసులుబాటు కల్పించిందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. గురువారం మండంలోని దూదిగాం, సోన్‌పేట్ గ్రామాలల్లో నిర్వహించిన భూభారతి పైలట్ ప్రాజెక్టు రెవెన్యూ సదస్సులలో కలెక్టర్ రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్‌డెస్క్, దరఖాస్తుల స్వీకరణ కౌంటర్ వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ఒకే దరఖాస్తులో రైతులు రెండు, మూడు రకాల భూసమస్యలను పేర్కొనే సమయంలో వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఆన్‌లైన్‌లో జాగ్రత్తగా ఎంట్రీ చేయాలని అన్నారు. వివరాల నమోదులో తప్పిదాలకు ఆస్కారం కల్పించకూడదని, ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని డేటా ఎంట్రీ ఆపరేటర్లకు సూచించారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం 18 రాష్ట్రాలలో సమగ్ర అధ్యయనం జరిపి, నూతన ఆర్‌ఓఆర్ చట్టం అమలులోకి తెచ్చిందన్నారు. ప్రస్తుతం పైలెట్ ప్రాతిపదికన మెండోర మండంలోని ఆయా గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల సందర్భంగా వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్ణీత గడువులోపు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ధరణి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా అప్లయి చేసుకోవచ్చని అన్నారు. భూ రికార్డులలో పేరు తప్పుగా ఉండడం, విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావంలో మార్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూసమస్యలు, సర్వేనెంబర్ మిస్సింగ్, పట్టాపాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామ కేసులు, హద్దులు నిర్ధారణ, పార్ట్-బిలో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర వాటికి సంబంధించిన దరఖాస్తులు స్వీకరించి భూభారతి చట్టంలో పొందుపర్చిన మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేలా రెవెన్యూ బృందాలకు మార్గనిర్దేశం చేశామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఆర్ఐ వేణుగోపాల్ చారి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 31లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

నిజామాబాద్ అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించుటకు ఈ నెల 31చివరి తేదీ అని, 500/-అపరాధ రుసుముతో జూన్ 5వ తేదీ చివరి తేదీ అని గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాంమోహన్ రెడ్డి, ప్రాంతీయ సమన్వయ కర్త డాక్టర్ కె. రంజిత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు 20-06-2025 నుంచి 25-06-2025 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ బీఆర్‌ఏడీవీ ఆన్‌లైన్‌లో లేదా 7382929612ను సంప్రదించగలరని ఆయన తెలిపారు.

ఆర్మూర్, బోధన్ మున్సిపాలిటీలకు కొత్త మాస్టర్ ప్లాన్!



- అమృత్-2 స్కీం కింద చేపట్టిన ప్రభుత్వం
- డ్రోన్‌ల ద్వారా మొదట సర్వే నిర్వహించిన కన్సల్టెన్సీ సభ్యులు
- ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో 85వేలకు చేరుకున్న జనాభా
- బోధన్ మున్సిపాలిటీలో 60వేలు దాటిన జనాభా



ఆర్మూర్‌లో మాస్టర్ ప్లాన్ కోసం డ్రోన్ సహాయంతో సర్వే నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)


నిజామాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో బోధన్, ఆర్మూర్ మున్సిపాలిటీల పరిధిలో జనాభా పెరుగుతుండడంతో ప్రభుత్వం అమృత్ పథకం 2 కింద కొత్త మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేస్తోంది. ఈ రెండు మున్సిపాలిటీల పరిధిలో జనాభా 50వేలు దాటడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. డ్రోన్‌ల ద్వారా ఈ రెండు మున్సిపాలిటీలను పరిశీలించడంతో పాటు వచ్చే 20ఏళ్లపాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ఈ మాస్టర్ ప్లాన్‌ను ఉప టయోగించనున్నారు. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా మున్సిపాలిటీలు అభివృద్ధి చెందే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మున్సిపాలిటీల పరిధిలో ప్రస్తుతం ఉన్నవాటికన్నింటికీ జీఐఎస్ మ్యాపింగ్‌ను చేయనున్నారు. ప్రత్యేక బృందాల ద్వారా ఇప్పటికే సర్వే నిర్వహించిన అధికారులు పూర్తిస్థాయిలో మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేయనున్నారు. మాస్టర్ ప్లాన్ పూర్తయిన తర్వా టత ప్రభుత్వానికి పంపించి అనుమతులు తీసుకోనున్నారు. ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌కు గెజిట్ విడుదల చేయగానే దానికి అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

విస్తరించిన మున్సిపాలిటీలు

ఆర్మూర్, బోధన్ మున్సిపాలిటీల పరిధిలో పాత ప్లాన్‌కు అనుగుణంగానే ఇప్పటి వరకు నిర్మాణాలు చేపడుతున్నారు. రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణంతో పాటు ఇతర పనులను చేపడుతున్నారు. ఈ రెండు మున్సిపాలిటీలు గడిచిన కొన్నేళ్లుగా విస్తరిస్తున్నాయి. వీటి పరిధిలో గ్రామాలు చేరడం వల్ల వైశాల్యం కూడా పెరిగింది. చుట్టు పక్కల మండలాల నుంచి అవసరాల కోసం వచ్చేవారు ఇక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకుంటుండడంతో జనాభా భారీగా పెరిగింది. ఆర్మూర్ మున్సిపాలిటీ జనాభా సరాసరి 85వేలకు చేరుకోగా, బోధన్ మున్సిపాలిటీ జనాభా 60వేలకు పైగా దాటింది. శివారు గ్రామాలు కూడా కలుస్తుండడంతో ఈ మున్సిపాలిటీల పరిధిలో జనాభా సంవత్సరానికి భారీగా పెరుగుతోంది. గ్రామాల విలీనం కావడం వల్ల మున్సిపాలిటీల విస్తీర్ణం కూడా ఎక్కువగా పెరిగింది. రాబోయే రోజుల్లో మున్సిపాలిటీల జనాభా పెరుగుతుండడంతో రాష్ట్రంలో 20 మున్సిపాలిటీలను అమృత్ 2 కింద చేపట్టి ఈ మాస్టర్ ప్లాన్‌ను తయారు చేస్తున్నారు. జిల్లాలో ఈ రెండు మున్సిపాలిటీలను ఎంపిక చేసి గత ఫిబ్రవరి, మార్చి నెలల్లో జిల్లాకు వచ్చిన ప్రత్యేక బృందాలు మున్సిపాలిటీ పరిధిలో పర్యటించారు. మున్సిపాలిటీల్లో ఏవేవి ఉన్నాయో వివరాలను సేకరించారు. డ్రోన్‌ల ద్వారా వారం రోజులపాటు సర్వే నిర్వహించి ఛాయా చిత్రాలను తీసుకోవడంతో పాటు వివరాలన్నీ నమోదు చేశారు. మున్సిపాలిటీల పరిధిలో రోడ్లు, డ్రైనేజీలు, చెరువులు, భవనాలు, రహదారులు ప్రభుత్వ కార్యాలయాలు గుర్తించడంతో పాటు ఎన్నెన్ని ఉన్నాయో వివరాలను తీసుకున్నారు.ఈ మున్సిపాలిటీల పరిధిలో మొత్తం వైశాల్యాన్ని తీసుకోవడంతో పాటు ఆ వివరాల ఆధారంగా కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తారు.

వచ్చే 20 ఏళ్లకు అనుగుణంగా

కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం వచ్చే ఇరవై ఏళ్లలో పెరిగే జనాభా, విస్తీర్ణం, కావాల్సిన మౌలిక వసతులు, పరిశ్రమలు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తారు. మున్సిపాలిటీల వస్తీర్ణానికి అనుగుణంగా నివాస ప్రాంతాలు, ఇండస్ట్రీయల్ జోన్, ఎడ్యుకేషన్ జోన్, ఈకో జోన్, కమర్షియల్ జోన్‌లుగా కొత్త మాస్టర్ ప్లాన్‌లో పొందుపరుస్తారు. ప్రతి సంవత్సరం గ్రామాల నుంచి పట్టణాలకు ప్రజలు ఎక్కువగా వలస వస్తుండడంతో వాటిపైన ఒత్తిడి పెరుగుతోంది. పెరిగే జనాభాకు అనుగు ణంగా నివాస స్థలాలతో పాటు తాగునీరు అవసరం అధికమవుతోంది. కొత్తగా కాలనీలు విస్తరించడం.. వాటిలో మౌలిక వసతులు కల్పించడం మున్సిపాలిటీలకు భారంగా మారుతోంది. ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో మాస్టర్ ప్లాన్ లేకపోవడం వల్ల ఇష్టం వచ్చిన రీతిలో కాలనీలు పెరుగుతున్నాయి. ఈ రెండు మున్సిపాలిటీల పరిధిలో అమృత్ స్కీమ్ కింద మాస్టర్‌ప్లాన్ రూపొందితే కొత్త నిర్మాణాలకు అవకాశం వస్తుంది. మాస్టర్ ప్లాన్‌లకు అనుగుణంగానే మున్సిపాలిటీల పరిధిలో నిర్మాణాలు జరగడంతో పాటు మౌలిక వసతులు పెరగనున్నాయి. ఈ మున్సిపాలిటీల పరిధిలో కొత్త మాస్టర్ ప్లాన్ కోసం ఇప్పటికే ప్రత్యేక బృందాలు సర్వే నిర్వహించాయని ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. అమృత్ 2 స్కీం కింద ఈ కొత్త మాస్టర్ ప్లాన్ కోసం సర్వే చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌కు చెందిన కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి ఈ మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తారని ఆయన తెలిపారు.



ముగిసిన యూనిసెఫ్ బృందం క్షేత్ర పర్యటన



జిల్లా పర్యటనకు వచ్చిన యూనిసెఫ్ బృందం

నిజామాబాద్ అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ సప్లిమెంటరీ ఫీడింగ్ కార్యక్రమంలో భాగంగా రెండో దశలో నిజామాబాద్ జిల్లా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైనందున యూనిసెఫ్ బృందం జిల్లా పర్యటనకు వచ్చింది. క్షేత్ర స్థాయి పర్యటన చేసి రెండు ఆరోగ్య ఉప కేంద్రాలను, డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని సందర్శించారు. ముగ్గురు సభ్యుల యూనిసెఫ్ బృందం డాక్టర్ ఖ్యాతి తివారీ న్యూట్రిషన్ స్పెషలిస్ట్, రేషా నికుంజు దేశాయి న్యూట్రిషన్ ఆఫీసర్, నర్సింహా రావులతో కూడిన బృందం జిల్లాలో బుధ, గురువారం రెండు రోజుల పర్యటనలో భాగంగా మొదటి రోజు మహిళా శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో జరగగా.. గురువారం జిల్లా వైద్యఆరోగ్య శాఖలోని ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు గల ఆరోగ్య ఉపకేంద్రాలు తిర్మన్‌పల్లి, గన్నారంలలో పోషకాహార లోపంతో బాధపడే సామ్, మామ్ చిల్డ్రన్స్‌ను పరిశీలించారు. ఇక్కడ పోషకాహారం లోపంతో బాధపడే చిన్నారులకు అందించే సేవలపై యూనిసెఫ్ బృందం సంతృప్తి చెందారు. బృందం వారికి జిల్లా ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ తగు సమాచారం అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వచ్చే జూన్ నెలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు సామ్, మామ్ చిల్డ్రన్స్‌కు అందించే స్పెషల్ సప్లిమెంటరీ ఫీడింగ్‌లో భాగంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపరింటెండెంట్ ఇందిరా, న్యూట్రిషన్ విభాగం నుంచి రాంబాబు పాల్గొన్నారు.



రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు

- వానాకాలం కోసం విత్తనాల పంపిణీకి అధికారుల ఏర్పాట్లు
- ఉమ్మడి జిల్లాలో సహకార సొసైటీలు, డీలర్ల ద్వారా పంపిణీ

నిజామాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ వానాకాలం సాగు కోసం విత్తనాలను అందుబాటులోకి తెచ్చింది. ఉమ్మడి జిల్లాలోని రైతుల కోసం అవసరమైన విత్తనాలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలోని సహకార సొసైటీల ద్వారానే కాకుండా మార్క్‌ఫెడ్ ఇతర సంస్థల ద్వారా ఈ విత్తనాలను రైతులకు అందుబాటులోకి తీసుకు వస్తుంది. ఉమ్మడి జిల్లాలోని రైతులు వేసే పంటల ఆధారంగా ఈ విత్తనాలను అందించేందుకు సిద్ధమవుతోంది. జిల్లాలో సొసైటీల ద్వారానే కాకుండా డీలర్స్ ద్వారా కూడా అందించే విధంగా ఏర్పాట్లు చేస్తోంది.

వచ్చే నెల నుంచి వానాకాలం సాగు షురూ

ఉమ్మడి జిల్లాలో వానాకాలం సాగు జూన్ నుంచి మొదలుకానుంది. ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారు 90లక్షల ఎకరాల వరకు పంటలను సాగు చేయనున్నారు. దీనిలో 6లక్షల ఎకరాల వరకు వరిపంటనే సాగు చేయనున్నారు. వానాకాలంలో సాగు విస్తీర్ణం పెరగనుండడంతో రైతులకు కావాల్సిన విత్తనాలను రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ అందుబాటులోకి తెస్తోంది. ఇప్పటి వరకు వరి, పెసర, మినుములు అందుబాటులోకి తీసుకువచ్చిన అధికారులు ఇతర విత్తనాలను కూడా మరికొద్దిరోజుల్లో అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా పరిధిలో వరిసాగు అధికం

ఉమ్మడి జిల్లా పరిధిలో వరిసాగు ఎక్కువగా కానుండటంతో రైతుల కోసం పలు రకాల విత్తనాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. వరిలో బీపీటీ 5204 విత్తనాలు 10వేల క్వింటాలు అందుబాటులోకి తెచ్చారు. కిలో 45 రూపాయలకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వరిలో కేఎన్ఎం 1630రకం 18వేల క్వింటాలు అందుబాటులోకి తెచ్చారు. వరిలో ఆర్ఎన్ఆర్ 15048 రకం 5వేల క్వింటాలు, ఎంటీయూ 1010 రకం 2వేల క్వింటాలు, కేఎన్ఎం 1018 రకం 2వేల క్వింటాలు, జేజీఎల్ 24423 రకం 2వేల క్వింటాలను అందుబాటులోకి తెచ్చారు. జిల్లాలోని సహకార సొసైటీలు, మార్క్‌ఫెడ్, డీలర్ల ద్వారా అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆయా రకాలనుబట్టి రైతులకు అవసరమైన ఈ విత్తనాలను సరఫరా చేస్తున్నారు. విత్తనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రైతుల నుంచి సేకరించిన ఈ విత్తనాలను వానాకాలం కోసం అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటితో పాటు మినుములు 200 క్వింటాలు, పెసర్లు 200 క్వింటాలు ఇప్పటి వరకు అందుబాటులోకి తెచ్చారు. ఇవే కాకుండా మొక్కజొన్న, సోయా ఇతర విత్తనాలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. వానాకాలం సాగుకు ముందే వీటిని అందుబాటులో ఉంచే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వరి సాగుకు ముందు రైతులు ఎక్కువగా వేసే పచ్చిరొట్టకు సంబంధించి జైంచ 10వేల క్వింటాలు, తన్‌హెంప్ రకం 200 క్వింటాలు అందుబాటులోకి తెచ్చారు. వీటిని రైతులకు సబ్సిడీలో అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా రైతుల కోసం ఈ విత్తనాలను అందుబాటులోకి తీసుకువచ్చామని విత్తనా భివృద్ధి సంస్థ రీజినల్ మేనేజర్ రఘు తెలిపారు. రైతుల కోసం నాణ్యమైన విత్తనాలను అందిస్తున్నామని అన్నారు. సొసైటీల ద్వారానే కాకుండా ప్రైవేటు డీలర్ల ద్వారా కూడా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు.



లారీ డ్రైవర్ల చేతివాటం!



- ధాన్యం తరలింపునకు డబ్బులు వసూలు చేస్తున్న లారీ డ్రైవర్లు
- బస్తాకు రూ.8 వరకు డిమాండ్
- హమాలీల చార్జీలతోపాటు డ్రైవర్లకు చెల్లింపులతో రైతులపై పెరుగుతున్న భారం
- పట్టించుకోని జిల్లా అధికారులు

నిజామాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో భారీగా ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నా.. దళారులు మాత్రం రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ధాన్యాన్ని తరలించేందుకు లారీ డ్రైవర్లు రైతుల నుంచి బస్తాకు 8 రూపాయలు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. డబ్బులు ఇవ్వని రైతుల ధాన్యాన్ని రోజుల తరబడి ఉంచుతున్నారు. అకాల వర్షాలతో ఇబ్బందులు పడుతున్న రైతులు హమాలీల చార్జీలతో పాటు తరలింపునకు కూడా డబ్బులు ఇవ్వాల్సి రావడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. క్వింటాలుకు రూ.50 వరకు ఖర్చు భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ధాన్యం తరలింపు కోసం సంబంధిత కాంట్రాక్టర్లు అదనంగా లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. కొంతమంది రైతులు అధికారులకు ఈ దోపిడీపై ఫిర్యాదులు చేసినా డ్రైవర్లు మాత్రం తరలించేందుకు ముందుకు రావడం లేదు. డబ్బులు ఇచ్చిన రైతులవే ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని తరలింపు చేపడుతున్నారు. అధికారులు కొన్నిచోట్ల ఈ వ్యవహారాన్ని పరిశీలించి కాంట్రాక్టర్లను మందలించినా వసూళ్లు మాత్రం ఆగడం లేదు.

7లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోళ్లు

జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 7లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యాన్ని కొనుగోలు చేశారు. మెజార్టీ మండలాల నుంచి ధాన్యాన్ని తరలించారు. ఇప్పటికి నిజామాబాద్ రూరల్, మోపాల్, మాక్లూర్, ఆర్మూర్‌తోపాటు మరికొన్ని మండలాల్లో ధాన్యం నిల్వలు ఉన్నాయి. ప్రతిరోజూ పదుల సంఖ్యలో లారీల ద్వారా ఈ ధాన్యాన్ని తరలిస్తున్నారు. జిల్లాలోని అన్ని మిల్లులకు కేటాయింపులు చేయడం వల్ల కొన్న ధాన్యాన్ని ఆ మిల్లులకు పంపిస్తున్నారు. మిల్లులకు వెళ్లిన లారీలు అన్‌లోడ్‌కు ఐదు రోజుల వరకు సమయం పడుతుండడంతో లారీలకు తీవ్రమైన కొరత ఏర్పడింది. ధాన్యం కొనుగోలు చేసిన బస్తాలు మాత్రం రోజుల తరబడి కేంద్రాల్లోనే ఉంటున్నాయి. అకాల వర్షాలు పడుతుండడంతో అమ్మిన ధాన్యంతో పాటు ఆరబోసిన ధాన్యం కూడా తడుస్తుండడంతో రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అకాల వర్షాల నుంచి కాపాడుకునేందుకు తిప్పలు పడుతున్నారు. ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలు ప్రారంభించిన సమయంలో హమాలీల కోసం క్వింటాలుకు రూ.25 చెల్లిస్తున్నారు. హమాలీల చార్జీలు రైతులపైనే పడుతుండగా ప్రస్తుతం అదనంగా ధాన్యం తరలింపు భారం కూడా పడుతోంది. సీజన్ ఆరంభంలో బస్తాకు రూ.2 వసూలు చేసిన డ్రైవర్లు ప్రస్తుతం రూ.8 వరకు వసూలు చేస్తున్నారు.

860 లారీల కోసం టెండర్లు

ఈ సీజన్‌లో ధాన్యం తరలించేందుకు అధికారులు 860లారీల కోసం టెండర్లను పిలిచారు. కాంట్రాక్టర్‌కు అప్పజెప్పారు. ధాన్యం తరలించేందుకు సివిల్ సప్లయి శాఖ ద్వారా కాంట్రాక్టర్‌కు చెల్లింపులు చేస్తున్నారు. అయినా రైతుల నుంచి అదనంగా ఈ డబ్బులను వసూలు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కోసం 40కిలోల బస్తాను నింపడం వల్ల క్వింటాలుకు అదనంగా 20రూపాయల వరకు డ్రైవర్లకు చెల్లించాల్సి వస్తుంది. హమాలీతోపాటు బస్తాల తరలింపునకు క్వింటాలుకు 50రూపాయల వరకు భారం రైతుపైన పడుతోంది. ధాన్యం కొనుగోలు చేసిన కేంద్రాల ద్వారా తరలింపు చేయాల్సి ఉన్నా ఈ వ్యవహారాన్ని పట్టించుకోవడం లేదు. లారీల కాంట్రాక్టర్లు, డ్రైవర్ల ద్వారా ఈ వసూళ్లు చేపట్టడం వల్ల అదనంగా ప్రతిరోజూ లక్షల రూపాయల భారం రైతులపైన పడుతుంది. ఈ వ్యవహారంపై అధికారుల దృష్టికి రైతులు తీసుకువెళ్లినా ఫలితం ఉండడం లేదు. లారీల కొరత పేరుమీద దీనిని వసూలు చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. రైతు సంఘాల నేతలు కూడా అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కొనుగోళ్ల దగ్గర పడుతున్న సమయంలో వసూళ్లను ఆపాలని రైతులు కోరుతున్నారు.

పేద ప్రజల పార్టీ కాంగ్రెస్


సుంకెట్‌లో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

మోర్తాడ్ , మే8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకెట్ గ్రామంలో గురువారం ఉదయం ఉపాధిహామీ కూలీలతో కలిసి వారి సమస్యలను, ఇబ్బందులను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. గ్రామ శివారులో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందరికి అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ఎల్లప్పుడు పేద ప్రజల పక్షాన ఉంటుందని, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల మేరకు ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఆరోగ్యశ్రీని 10 లక్షల వరకు పెంచడం జరిగిందని, ఐదువందలకే వంటగ్యాస్ సిలిండర్ అందించడం జరిగిందని, రైతులకు రుణమాఫీ అమలు చేసిందని ఆయన వివరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందని వారి వివరాలను తెలుసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు.ఆయన వెంట రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి వేణురాజ్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గిర్మాజి గోపి, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు సుధీర్‌నాయక్, మాజీ ఎంపీపీ గిర్మాజి గంగాధర్, మోర్తాడ్ పట్టణ అధ్యక్షుడు పుప్పాల అశోక్, విడిసి మాజీ అధ్యక్షుడు జక్కం అశోక్, నరేష్, భూపతి, ఎంసీ గంగాధర్, నాగ భూషన్,సతీష్, నర్సారెడ్డి, భూమేష్‌సాయరెడ్డి, భూమారెడ్డి పాల్గొన్నారు.

పంట మార్పిడి పద్ధతులను పాటించాలి


కోటగిరిలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వ్యవసాయ అధికారులు

కోటగిరి,మే8(ఆంధ్రజ్యోతి): రైతులు పంట మార్పిడి పద్ధతులను పాటించాలని రుద్రూరు కేవీకే శాస్త్రవేత్త రమ్య రాథోడ్ సూచించారు. కోటగిరి మండల కేంద్రంలోని చావిడి వద్ద రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటల సాగులో రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని, తక్కువ యూరియా వినియోగం, భాస్వరం ఎరువులు పునాదిలో మాత్రమే వేయాల్సిన అవసరం ఉందన్నారు. పురుగు మందులను అవసరమైనప్పుడే సూచిన మేరకు వినియోగించాలన్నారు. దీని వల్ల నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. పంట మార్పిడి పాటించడం ద్వారా నేల సారాన్ని మెరుగుపర్చడంతో పాటు పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందన్నారు. పప్పు దినుసులు, నూనె గింజల వంటి పంటలను పంట సరళిలో చేర్చితే భవిష్యత్‌లో అధిక దిగుబడి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు జయప్రకాష్, ఏఎంసీ చైర్మన్ హన్మంత్, వ్యవసాయ అధికారి రాజు, నాయకులు మనోహర్, ఏఈవోలు ఆస్మా బేగం, సతీష్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్‌లో వేసవి శిక్షణ శిబిరం

ఆలూర్, మే8 (ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలంలోని అన్ని గ్రామాలలో గల 6 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థుల కొరకు మే 10 నుండి 25 వరకు వేసవి శిక్షణ శిబిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆలూరులో ఏర్పాటు చేసినట్లు ఆలూర్ మండల విద్యాశాఖాధికారి ఎం. నరేందర్ తెలియజేశారు. ఈ వేసవి శిక్షణ శిబిరంలో డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, యోగా, గణితంలో మెలకువలు నేర్పబడుతుంది. కావున మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు సద్వినియోగపర్చుకోవాలని ఎంఈవో నరేందర్ తెలియజేశారు.

ప్రతి ఒక్కరూ శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

● ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి


తగిలేపల్లిలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

వర్ని,మే8(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. వర్ని మండలం తగిలేపల్లి గ్రామంలో గురువారం ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. సొంత ఖర్చుతో బక్క రాములు, భారతి దంపతులు శివాజీ విగ్రహాన్ని సమకూర్చడం అభినందనీయమని ఆయన కొనియాడారు. మూడు వందల కోటలను జయించిన మహరాజు శివాజీ అని ప్రస్తుతం పాకిస్తాన్‌తో మనం ఎలా పోరాటం చేస్తున్నామో ఆ రోజుల్లో భారత దేశ సంస్కృతిని కాపాడేందుకు మత సామరస్యాన్ని కాపాడేందుకు ఛత్రపతి పాటు పడినట్లు గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ పాకిస్తాన్ కుట్రలను తిప్పి కొట్టేందుకు భారత సైనాన్ని రంగంలోకి దించడం గర్వకారణమని అభినందించారు. శివాజీకి కులం, మతం ఏది లేదని భవాని భక్తుడిగా ప్రజా క్షేమం కోసం పాటుపడ్డట్లు తెలిపారు. ప్రపంచమంత ఆయన్ని పూజించే గొప్ప మేధావి శివాజీ అని 50ఏళ్ల వయసులో మరణించిన ఆయన్ని అందరూ దైవంగా కొలవడం యువతకు ఆదర్శంగా పేర్కొన్నారు. ఒక రాజు అందమైన అమ్మాయిని శివాజీ ముందు నిల్చోబెట్టగా మీలాంటి అందమైన తల్లి కడుపులో నేను పుట్టి ఉంటే నేనూ అందంగా ఉండేవాడినని బదులిచ్చి తన తల్లి జ్ఞాపకంగా 14కాసుల వరంగా ఇచ్చి ఆమెను సైన్యంతో తోడుగా వారి ఇంటికి పంపి ప్రతి స్త్రీని తోబుట్టువుగా భావించిన మహనుభావుడు శివాజీ అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మల్లారం పీఠాధిపతి పిట్ల కృష్ణ మహరాజ్, సంతోష్ అప్ప, రాష్ట్ర ఆగ్రో చైర్మన్ బాలరాజు, నేమాని వీర్రాజు, భారీ, తొంట శంకర్, మైసన్ శ్రీధర్, దత్తాగౌడ్, భాగాగౌడ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

‘ఆపరేషన్ సిందూర్’ విజయోత్సవ సంబురాలు


జవాన్‌లకు మద్దతుగా సంఘీభావ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

బోధన్‌రూరల్,మే8(ఆంధ్రజ్యోతి): బోధన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బోధన్ నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం అంబేద్కర్ చౌరస్తా నుండి పట్టణ ప్రధాన వీధుల గుండా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఆపరేషన్ సిందూర్ బలగాలకు సంఘీభావ ర్యాలీని నిర్వహించారు. ఉగ్రవాదులు అనవసరంగా 28మంది భారతీయులను దారుణంగా చంపడం హేయమైన చర్యగా టీపీసీసీ డెలిగేట్ అభివర్ణించారు. పాకిస్తాన్‌లో ఉగ్రవాద మూలాలను, అడ్డాలను తెలుసుకుని ఉగ్రవాదాన్ని అంతమొందించాలన్నారు. సంఘీభావ ర్యాలీకి ప్రజల నుండి విశేష స్పందన లభించింది, సంఘీభావ ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా నుండి పోస్టాఫీస్ వరకు భారీగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శరత్ రెడ్డి, హన్మంత్ రావు, హరికాంత్ చారి, తలారి నవీన్, కలీం, రాములు తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్:జమ్ముకాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు హిందువులను కాల్చి చంపిన ఘటనకు నిరసనా భారత ప్రభుత్వం ఆర్మీ ఆధ్వర్యంలో చేపట్టిన సిందూర్ ఆరపరేషన్ లో భాగంగా ఈనెల 7 ఉదయం పాకిస్తాన్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలను క్షిపణిలతో దాడిచేసి నేలమట్టం చేసి విజయం సాధించడంతో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు కనికరం మధు మాట్లాడుతూ ఇకముందు యుద్ధమే చేయ వలసీ వస్తే ప్రతీఒక్క పౌరుడు భారతీ య పౌరుడు ఒక జవాన్ లాగా మారి దేశానికి అండగా నిలుస్తామని తెలియజేశారు.ఈకార్యక్రమంలో రాష్ట్రకౌన్సిలర్ మెంబర్ యోగేశ్వర నర్సయ్య, బండారిలక్ష్మీణ్‌గౌడ్, సంధ్యరాజు పతాని ప్రవీణ్, అంజి, హరిప్రసాద్,నవీన్,అజయ్,ఈశ్వర్, సాయి కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్కొండ: పహల్గాం దాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ పేరిట భారత జవాన్లు పాకిస్తాన్ ఉగ్రవాదుల తొమ్మిది స్థావరాలపై అర్ధ రాత్రి దాడిచేసి తీవ్రవాదులను మట్టికరిపించిన సందర్భంగా బాల్కొండ మండల బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి సంబురాలు చేసు కున్నారు. మండల అధ్యక్షుడు అంబటి నవీన్, కిసాన్ మోర్చా జిల్లా కార్య వర్గ సభ్యులు తోట చిన్నయ్య, ప్రధాన కార్యదర్శి మీసాల చంద్రశేఖర్, కిసాన్ మోర్చ మండల అధ్యక్షుడు ఆరెపల్లి నర్సయ్య, ఐటీసెల్ మండల కన్వీనర్ కొట్టింటి రాకేష్, నాయకులు సేరియా జగన్, భూసం సత్యనారాయణ, జక్కం శ్రీకాంత్, సేరియాల సాయికార్తీక్, తోట నవీన్, సాయికిరణ్, నందిన్, రాంకిషన్, నవీన్, భోజిందేర్, శీను, వేణుగో పాల్, అరవింద్, నాగేష్, గంగాధర్, రాజు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ జూనియర్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

జక్రాన్‌పల్లి , మే8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జక్రాన్‌పల్లిలో ఆదర్శ జూనియర్ కళాశాలలో 2025-26 ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుధారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వరకు మొదటి సంవత్సరంలో చదువుకోవడానికి ఆసక్తిగత విద్యార్థులు ప్రవేశానికి ఆన్‌లైన్‌లో ఈల 25వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసు కున్న విద్యార్థులు ఎంపికైన జాబితాలో ఈ నెల 26న నోటీస్‌బోర్డులో ప్రదర్శించడం జరుగుతుందని 27 తేదీ నుంచి 31వ తేదీ వరకు సర్టిఫికెట్‌ల ధ్రువీకరణ, ప్రవేశప్రక్రియ పూర్తి అవుతుందని ఆమె తెలిపారు. పదో తర గతి పబ్లిక్ పరీక్షల్లో మెరిట్, రిజర్వేషన్ల నిబంధనల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఆంగ్ల, మాధ్యమంలో ఉచిత విద్య ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు, నీట్ కోచింగ్ , కెరియర్ కౌన్సిలింగ్, బాలికలకు హాస్టల్ వసతి సౌకర్యం ఉంటుందని తెలిపారు. కుట్లు అల్లికలు, వృత్తిపరమైన కోర్సులు, పోస్టుమెట్రిక్, స్కాలర్‌షిప్‌లు వస్తాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

కందకుర్తి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు తనిఖీ


కందకుర్తి చెక్‌పోస్టు వద్ద రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రావణ్ కుమార్

రెంజల్,మే8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందకుర్తి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును గురువారం తహసీల్దార్ శ్రావణ్ కుమార్ తనిఖీ చేశారు. మహరాష్ట్ర సరిహద్దు ప్రాంతం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు నుండి మహరాష్ట్ర నుండి తెలంగాణకు వరి ధాన్యం తరలిస్తున్నారన్న సమాచారంతో ప్రభుత్వం చెక్‌పోస్టును ఏర్పాటు చేయగా మహరాష్ట్ర నుండి ధాన్యం తరలించకుండా వాహనాలను తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. మహరాష్ట్రలో పండించిన ధాన్యాన్ని తెలంగాణ ప్రాంతానికి తరలించడం ద్వారా కందకుర్తి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు.

మహారాష్ట్ర ధాన్యం రాకుండా కట్టడి చేయాలి

● బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో


పొతంగల్ చెక్‌పోస్టులో రిజిష్టార్లను తనిఖీ చేస్తున్న బోధన్ సబ్ కలెక్టర్

కోటగిరి,మే8(ఆంధ్రజ్యోతి): కర్ణాటక, మహారాష్ట్రల నుంచి ధాన్యం తెలంగాణ రాష్ట్రంలోకి రాకుండా చెక్‌పోస్టు కట్టడి చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఆదేశించారు. పొతంగల్ మండలంలో గురువారం ఆయన పర్యటించారు. పొతంగల్, కొడిచర్ల చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ వాహనాన్ని తప్పనిసరిగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేశాకే అనుమతించాలని సూచించారు. ఇటీవల పక్క రాష్ట్రాల నుంచి ధాన్యం తెలంగాణ రాష్ట్రంలోకి వస్తుందన్న సమాచారం వచ్చిందన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని సూచించారు. ఇసుకను తరలించే వాహనాలకు వేబిల్లు లేకపోతే సీజ్ చేయాలని సూచించారు. అనంతరం పొతంగల్ తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీచేశారు. కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ, మెంబర్లను జత చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ గంగాధర్, రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

● రోగులకు నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలి

బోధన్‌రూరల్: ఆసుపత్రిలోని రోగులకు మెరుగైన వైద్యంతో పాటు నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించడం చాలా ముఖ్యమని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని, వంటశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. వంట శాలలోని గదులను పరిశీలించారు. వంటశాలలో వంటపాత్రలతో పాటు పరిసరాలను పరిశీలించారు. రోగులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని పేర్కొన్నారు. రోగులకు నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని వివరాలు సేకరించారు. రాష్ట్రం మొత్తం జరుగుతున్న డైట్ ఇన్‌స్ట్రషన్‌లో భాగంగా డిస్ట్రిక్ డైట్ టాస్క్‌ఫోర్స్ టీం బోధన్ జిల్లా ఆసుపత్రిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్‌తో పాటు ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వెంకటేష్, నారాయణ, ఫార్మసి, సూపర్‌వైజర్లు, నర్సింగ్ సూపరిండెంట్ తదితరులున్నారు.

ఆర్మూర్‌లో వీర జవాన్‌కు నివాళులు



వీరజవాన్‌కు నివాళులు అర్పిస్తు, మౌనం పాటిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ఆర్మూర్‌టౌన్, మే8(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీరజవాన్ సచిన్ యాదవ్‌కు గురువారం బార్‌సభ్యులు నివాళులు అర్పించారు. మద్నూర్ మండల కేంద్రం దెగ్లూర్ కు చెం దిన సచిన్ యాదవ్ జమ్ముకాశ్మీర్‌లో జరిగిన సీజ్‌ఫైర్ కాల్పుల్లో వీరమరణం పొందాడని ఆయన ఆత్మ శాం తించాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్, ఉపాధ్యక్షుడు గట్టడి ఆనంద్, చైతన్య, పండిత్ కృష్ణ, ఎంకే. నరేందర్, చిల్క కిష్టయ్య, విప్లవ్ కిరణ్, తెడ్డు నర్సయ్య, అవారి రమేష్, ఆవుల అశోక్, కీర్తి సాగర్, ఖాందేష్‌సంగీత, అశోక్, షిండె, రాము, గణేష్, రాము, శ్రీదర్, రాకేశ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ

ముప్కాల్, మే8 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 2001-2002 పూర్వ విద్యార్థులు 10 కుర్చీలను పాఠశాలకు గురువారం అందజేశారు. రాబోయే రోజుల్లో పాఠశాలకు తమ తోడ్పాటు ఎప్పటికి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గంగారాం, పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, రాజేందర్, రాము, రాజేశ్వర్, వసంత్, సాగర్, శిరీష, విజయలక్ష్మీ తదితరులున్నారు.

‘టీడీపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి’

వర్ని, మే 8(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి విఠల్ అన్నారు. గురువారం బాన్సువాడ నియోజకవర్గంలోని వర్ని మండల కేంద్రంలో టీడీపీ మెంబర్‌షిప్ కార్డులను కార్యకర్తలకు ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు విఠల్, రవికుమార్, రామకృష్ణ, బాలాజీ, శ్రీనివాస్ రావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లలో ఆర్మూర్‌కు మొదటిస్థానం

ఆర్మూర్‌టౌన్, మే8(ఆంధ్రజ్యోతి): ఎర్లీబర్డ్ ఆస్తిపన్ను వసూళ్లలో ఉమ్మడి జిల్లాలో మొదటిస్థానం సంపాదించినట్లు మున్సిపల్ కమిషనర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ఎర్లీబర్డ్ పథకం కింద ఆస్తిపన్నులో 5శాతం రాయితీని కల్పించడంతో 2025-26వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్ను వసూళ్లలో 40 శాతం ఇంటి యజమానులు పన్నులు చెల్లించారని దీంతో 7కోట్ల 33 లక్షల డిమాండ్‌కు గాను 2 కోట్ల 30 లక్షలు వసూలు చేయడం జరిగిందని రాష్ట్రంలో 16వ స్థానంలో ఉన్నామని కమిషనర్ తెలిపారు.

‘భక్తి మార్గాన్ని ఎంచుకోవాలి’


మాట్లాడుతున్న పిట్ల కృష్ణ

వర్ని, మే 8(ఆంధ్రజ్యోతి): ధర్మం పట్ల భావన కలిగి భక్తి మార్గాన్ని ఎంచుకోవాలని మల్లారం పీఠాధిపతి పిట్ల కృష్ణ మహరాజ్ అన్నారు. గురువారం తగిలేపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణలో భాగంగా ఆయన మాట్లాడారు. ధర్మ సంస్థానం కోసం పాటుపడిన గొప్ప వ్యక్తి శివాజీ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాసుల బాలరాజు, ఏఎంసీ చైర్మన్ సురేష్, గోపాల్, సంతోష్ అప్ప పాల్గొన్నారు.

‘పంటల అవశేషాలను కాల్చకండి’

ముప్కాల్, మే8 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట అవశేషాలను కాల్చకుండా పంట పొలాల్లోనే కలియదున్ని పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ వరి వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కల్పన అన్నారు. గురువారం ముప్కాల్ మండ లంలోని కొత్తపల్లిలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్త కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథి వేల్పూర్‌మార్కెట్ కమిటీ చైర్మన్ జైడి చందరవి, కోటపాటి నర్సింహనాయుడు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై కళాజాతా

ఆర్మూర్‌టౌన్ , మే 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలపై గురువారం పోలీసులు కళాజాత నిర్వహించారు. ఆటోలలో నిబంధనలకు మించి ప్రయాణీకులను తీసుకెళ్లరాదని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీట్ బెల్టు ధరించాలని వాహనదారులకు ఆటపాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై రఘుపతి, సిబ్బంది సంతోష్ ఆనంద్, కళాజాత బృందం పాల్గొన్నారు.

నిజాయితీని చాటుకున్న మున్సిపల్ జవాన్

బోధన్‌రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని మున్సిపల్ శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న గాబ్రియల్ అనే మున్సిపల్ జవాన్‌కు గురువారం ఉదయం రోడ్డుపై లక్ష రూపాయలతో పాటు ఐఫోన్ దొరికింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించి నిజాయితీని చాటుకున్నాడు. అంతలోనే డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తి స్నేహిత్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి వినతిపత్రం అందించారు. వెంటనే పోలీసులు గాబ్రియల్‌ను పిలిపించి లక్ష రూపాయలతో పాటు ఐఫోన్‌ను పోగొట్టుకున్న ఓనర్ స్నేహిత్‌కు పోలీస్ స్టేషన్‌లోనే అప్పజెప్పారు. మున్సిపల్ జవాన్ గాబ్రియల్ చేసిన పనికి పోలీసులతో పాటు పట్టణ ప్రముఖులు అతని నిజాయితీని అభినందించారు.

వేల్పూర్‌లో విద్యార్థులకు ఉచిత శిక్షణ కార్యక్రమం

వేల్పూర్ , మే8 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 10 నుంచి 24 వరకు విద్యార్థిని విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంఈవో రేణుక తెలిపారు. 6 నుంచి 9వ తరగతికి చెందిన విద్యార్థిని విద్యార్థులకు యోగా, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, డ్యాన్స్ వంటి కార్యక్రమాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు.

‘పది’లో మండల టాపర్‌కు సన్మానం


టాపర్‌ను సన్మానిస్తున్న జిల్లావిద్యాధికారి

కమ్మర్‌పల్లి, మే 8: (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి పరీక్ష ఫలితాల్లో 559 మార్కులతో ప్రైవేట్ పాఠశాల విభాగంలో విజ్ఞాన జ్యోతి పాఠశాల విద్యార్థి నందగిరి వర్షిత్ మండల్ టాపర్‌గా నిలువగా గురువారం జిల్లావిద్యాధికారి అశోక్ అభినందిస్తు శాలువా కప్పి జ్ఞాపిక అందజేస్తు సన్మానించారు. కార్యక్రమంలో విజ్ఞానజ్యోతి పాఠశాల కరస్పాండెంట్ గుండోజి దేవేందర్, ప్రదానోపాధ్యాయురాలు సౌమ్య, డీఈవో సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ బ్యాగులో నుంచి 8 తులాల బంగారం మాయం

కామారెడ్డిటౌన్, మే 08(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలి చేతిలో ఉన్న బ్యాగు నుంచి ఎనిమిది తులాల బంగారం మాయమైనట్లు కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం మైలారం గ్రామానికి చెందిన సుదేష్ణ అనే మహిళ హైదారాబాద్ నుంచి కామారెడ్డి ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చింది. కామారెడ్డి బస్టాండ్‌లో దిగి అక్కడి నుంచి భీంగల్ వెళ్లే బస్సు ఎక్కేందుకు వేచి ఉంది. సాయంత్రం 5:40గంటల సమయంలో భీంగల్ బస్సు ఎక్కిన తర్వాత ఆమె దగ్గర ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను పరిశీలించగా బ్యాగ్ జీప్ తెరిచి ఉంది. అనుమానం వచ్చిన సుదిష్ణ బ్యాగును పరిశీలించగా 8తులాల బంగారు ఆభరణాలు దొంగిలించబడ్డాయని గుర్తించింది. ఈ విషయాన్ని ఆర్టీసీ సిబ్బందికి తెలియజేసింది. అనంతరం కామారెడ్డి పట్టణ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై పట్టణ సీఐ కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు తెలిపారు. ఐతే ఆమె ప్రయాణించిన బస్సులో తోటి ప్రయాణికులను విచారణ చేపడుతుండగా అక్కడ గంజాయికి సంబంధించిన ప్యాకెట్ దొరికిందని సమాచారం. ఆ ప్యాకేట్‌ను బస్సులోనే గుర్తుతెలియని వ్యక్తులు ఎవరో వదిలేసి వెళ్లారని తెలిసింది. ఈ విషయంపైనా పోలీసులు దృష్టిసారించారని సమాచారం.

ఆపరేషన్ కాగర్‌లో మరణించిన పాల్వంచ వాసి


గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ వడ్ల శ్రీధర్ (ఫైల్)

మాచారెడ్డి మే 8(ఆంధ్రజ్యోతి): పాల్వంచ మండల కేంద్రానికి చెందిన వడ్ల శ్రీధర్ (26) మలుగు జిల్లా వాజేడులో ఆపరేషన్ కాగర్‌లో కుంబింగ్ చేస్తున్న సమయంలో ల్యాండ్ మైన్ పేలడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ నెల 7న మావోయిస్టుల కోసం ఆపరేషన్ కాగర్‌లో కుంబింగ్ చేస్తున్న సమయంలో ల్యాండ్‌మైన్ పేలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం వరంగల్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్న సమయంలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన వడ్ల లక్ష్మీ, గంగారాం రెండవ కుమారుడైన శ్రీధర్ మూడు సంవత్సరాల క్రితం గ్రైహౌండ్ కానిస్టేబుల్‌గా ఎంపికై విధుల్లో కొనసాగుతున్నాడు. మృతునికి తొమ్మిది నెలలక్రితమే వివాహం అయింది,. అయితే పోలీసు ఉన్నతాధికారులు మృతుని కుటుంబ సభ్యులకు శ్రీధర్ ల్యాండ్‌మైన్‌లో గాయపడి పరిస్థితి విషమంగా ఉందని వెంటనే వరంగల్ ఆసుపత్రికి రావాలని సమాచారం అందించారు. దీంతో అక్కడకు చేరుకున్న కుటుంబ సభ్యులకు మరణ వార్త విని గుండేలావిసేలా రోదించారు. మృతునికి భార్య శ్రీవాణి ఉన్నారు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

ఉద్యాన శాఖ పథకాలపై అవగాహన

భీమ్‌గల్ రూరల్ , మే8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారేపల్లి, దేవన్ పల్లి గ్రామాలలో గురువారం ఉద్యానశాఖ పథకాలపై అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల ఉద్యాన శాఖ అధికారి రోహిత్ పండ్లతోటలకు, కూరగాయల సాగుకు, పూలసాగుకు, సూక్ష్మనీటి సేద్యానికి, ఆయిల్ ఫామ్ సాగు తదితర పంటలకు ప్రభుత్వం నుండి సబ్సిడీ రుణాలు మంజూరు అవుతాయని, అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు.

రామారెడ్డిలో విద్యార్థిని అదృశ్యం


రామారెడ్డి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బిట్ల కీర్తన (ట్రీ) పదోతరగతి విద్యార్థిని కనిపించడం లేదని రామారెడ్డి ఎస్సై నవీన్ చం ద్ర పేర్కొన్నారు. ఎస్సై కథనం ప్రకారం... తల్లిదండ్రులు పనికి వెళ్లగా, కీర్తన ఇంటి వద్దనే ఉండేది. గురువారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఆమె సోద రుడు రాజ్‌కుమార్‌కు ఫోన్ చేసి రామారెడ్డి మీ సేవకు వెళుతున్నానని చెప్పి ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె తల్లి బిట్ల రేణుక పని నుంచి తిరిగి వచ్చాక కూతురు కనిపించకపోవడంతో బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. తల్లి రేణుక ఫిర్యాదు మేరకు ఎస్సై నవీన్‌చంద్ర కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

వేసవి సెలవుల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి, మే 8 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో గ్రామాల్లో చోరీలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు కళాబృందం గురువారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవులలో ఇల్లు వదిలి వెళ్ళినప్పుడు విలువైన వస్తువులు మీ వెంటనే తీసుకెళ్లాలని, పక్క ఇంటి వారికి సమాచారంతో పాటు దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలనే విధంగా విద్యార్థులు చెరువులకు ఈతకు వెళ్లి ప్రాణాల మీదికి తెచ్చుకోకుండా తల్లిదండ్రులు పిల్లలపై నిఘా ఉంచాలని తెలిపారు. చోరీలను నివారించేలా అత్యవసర సమయంలో వంద నెంబర్‌కి కాల్‌చేయాలని సూచించారు మహిళల రక్షణ కోసం ఎళ్ల వేళలా షీ టీం అందుబాటులో ఉంటుందని, సైబర్‌నేరాల పట్ల అవగాహన కలిగి ఉండి గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా మనకు ఫోన్‌చేసిన వ్యక్తిగత సమాచారాన్ని ఓటీపీని అడిగితే వాళ్లకు సమాధానం ఇవ్వవద్దని తెలిపారు ఒకవేళ సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930కు కాల్‌చేసి వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ మహేష్, కళాబృందం సభ్యులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీ


ఎల్లారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఎల్లారెడ్డి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని గురువారం సాయంత్రం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యే మదన్మోహన్ రావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు జాతీయ జెండాలతో గాంధీ చౌక్ నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించి సైనికులకు సంఘీభావ ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ సామెల్, నాయకులు విద్యాసాగర్, శ్రీనివాస్, జక్కుల సంతోష్, రాములు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్ ప్రాంతంలో సాగవుతున్న సీడ్ వరి పంట

సీడ్ వరిసాగుపై రైతుల ఆసక్తి

● బైబ్యాక్ ఒప్పందంతో అదనపు ఆదాయం

ఆర్మూర్ రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): రైతులు సాంప్రదాయంగా సాగుచేస్తున్న వరిపంట స్థానంలో సీడ్ వరిసాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఆర్మూర్ డివిజన్‌లోని ముప్కాల్, బాల్కొండ, మోర్తాడ్, ఆర్మూర్, నందిపేట్, డొంకేశ్వర్ మండలాలలోని వివిధ గ్రామాలలో రైతులు సీడ్‌వరి పంటను సాగుచేస్తున్నారు. పంట దిగుబడులు, ధర ఒక్కొక్క కంపెనీని బట్టి ఉంటుంది. సీడ్ వరిధాన్యం సాగుచేసి రైతులకు సన్నరకం ఎకరాన 26 నుండి 28 క్వింటాల్ల దిగుబడి వస్తుండగా దొడ్డురకం ధాన్యం ఎకరాన 28 నుండి 30 క్వింటాల్ల వరకు దిగుబడి వస్తుంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయించే ధరకంటే క్వింటాలుకు 100 నుండి 300 రూపాయలు ఎక్కువగా వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు. సీడ్ వరి సాగులో శ్రమ ఎక్కువగా ఉంటున్నప్పటికి ధర ఎక్కువగా వస్తుండడంతో రైతులు ఇటువైపు మొగ్గుచూపుతున్నారు.

ఆదాయం ఎక్కువ.. ఖర్చు తక్కువ

వరిధాన్యం బైబ్యాక్ ఒప్పందం ద్వారా రైతుల నుంచి వ్యాపారులే నేరుగా కొనుగోలు చేస్తుంటారు. సాంప్రదాయంగా సాగుచేస్తున్న వరి ధాన్యం క్వింటాలుకు ప్రభుత్వం 2300 రూపాయలు అందజేస్తుండగా సీడ్ కంపెనీ వారు వంద నుంచి 300 రూపాయలు ఎక్కువ అందజేస్తుండడంతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుంది. ప్రభుత్వం ప్రస్తుతం సన్నరకం ధాన్యం పండించిన రైతులకు ప్రభుత్వ మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయలు బోనస్ అందజేస్తున్నారు. అయినప్పటికి రైతులు సీడ్ వరిసాగునకు మొగ్గుచూపడం విశేషం. సీడ్ వరి సాగు చేసే రైతులకు ధాన్యం విక్రయించే సమయంలో ఖర్చులు తగ్గుతున్నాయి. సాంప్రదాయంగా సాగుచేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో విక్రయిస్తే క్వింటాలుకు 18 రూపాయలు హమాలి ఖర్చులు తరుగు రైతు భరించాల్సి వస్తుంది. సీడ్ వరిధాన్యానికి లోడింగ్, రవాణ ఖర్చులు వారే భరించడం వల్ల రైతులకు క్వింటాలుకు 18 రూపాయల హమాలి ఖర్చులు, తరుగు పేరిట కోత ఆదాఅయి రైతుకు ఎంతోకొంత డబ్బులు అదనంగా లభిస్తున్నాయి.

సీడ్ వరిసాగులో శ్రమకూడా అధికమే

సీడ్ వరిపంట సాగు చేస్తున్న రైతులకు ఆదాయం భాగానే ఉంటున్నప్పటికీ శ్రమకూడా అధికమే. ఒక్కొ కంపెనీ ఒక్కొక్క ధరను రైతులకు అందజేస్తుంది. ఆర్మూర్ ప్రాంతంలో ఇదివరకు సాగుచేసిన ఒక కంపెనీకి చెందిన రకానికి క్వింటాలుకు 11 వేల రూపాయలు చెల్లించి బైబ్యాక్ ఒప్పందం ద్వారా ధాన్యం కొనుగోలు చేయాడానికి ముందుకు వచ్చి విత్తనాలు సరఫరా చేశారు. పంట దిగుబడి ఏడు క్వింటాల్లనుండి 11 క్వింటాళ్ల వరకు వస్తుందని తెలిపారు. దొడ్డు, సన్నరకాలలో మేల్, ఫీమేల్ ధాన్యాన్ని రైతులు సాగుచేస్తున్నారు. ఈ పంట సాగులో 15 రోజుల పాటు శ్రమ అధికంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. పాలినేషన్ సమయంలో మేల్ పంటను తాడు సహయంతో ఫీమేల్ పంట మీదుగా దాటిస్తారు.(పూత దులపడం) మేల్ వరి మొదట కోసిన తర్వాత ఫీమేల్ వరిని హార్వేస్ట్ చేస్తారు. ఫీమేల్ పంటను కంపెనీ నిర్ణయించిన ధరకు కొనుగోలు చేస్తుంది. మేల్ పంటను రైతులు బహిరంగ మార్కెట్‌లో ఎక్కడన్న విక్రయించుకోవచ్చు. అంతేకాకుండా ఈ సంస్థ ఒక భరోస ఇస్తుంది. తాము చెప్పిన విదంగా గ్రామ యూనిట్‌గా దిగుబడులు 60 శాతం రానిపక్షంలో రైతులకు ఎకరాన 60వేల రూపాయలు చెల్లిస్తామని సీడ్ ఇచ్చిన కంపెనీ ముందుగానే ఒప్పందం చేసుకుంటుంది. ఇది రైతులకు కలిసివచ్చే అంశం. ఇలా ఉండగా వరిపంటకు ఒకదశలో మూడు సార్లు స్ప్రే చేయాల్సి ఉంటుంది. ఈ మందులు సంస్థ ఉచితంగానే అందజేస్తుంది. సాంప్రదా యక వరి సాగుకంటే అదనపు ఆదాయం వస్తుండడంతో రైతు లకు సీడ్ వరిసాగు లాభదాయ కంగామారిందని వారు పేర్కొంటున్నారు.



వరిపంటలో మేల్, ఫీమేల్‌కు పాలినేషన్ చేస్తున్న రైతులు

వృథా పోయినా ఫర్వాలేదు.. తొట్టిలో మాత్రం నీరుపడేలా చేయం

● వేసవికాలంలో నీటి వృథాను అరికట్టని పంచాయతీ సిబ్బంది

ఎల్లారెడ్డిరూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో కొన్నిచోట్ల నీరు దొరకక పోవడంతో ప్రజలు అల్లాడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కాని మరి కొన్ని చోట్ల నీరు ఉన్నవాటిని మాత్రం వృథాగా పోనిస్తున్నారే తప్ప అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునేలా చేయడం లేదు. ఎల్లారెడ్డి మండలంలోని మాచాపూర్ (పెద్దారెడ్డి) గ్రామంలో ఓ బోర్‌మోటార్ ద్వారా ప్రధానరోడ్డు పక్కన పశువుల దాహర్తి తీర్చేందుకు తొట్టి నిర్మించారు. కాని ఈ తొట్టిలో నీరు పడే విధంగా పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవడం లేదు. నీరు వృథా పోయిన ఫర్వాలేదు.. కాని తొట్టిలో మాత్రం నీరు పడేలా చేయమనే నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తుండడంతో నీరు అంతా వృథాగా పోతుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. వృథాగా పోతున్న నీటితో మడుగులు కట్టి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టడమే కాకుండా నీటిని పశువులకు, ప్రజల ఇతర అవసరాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వృథాగా పోతున్న నీరు



డిచ్‌పల్లిలోని మానవతా సదన్



విద్యార్థుల కోసం నిర్మించిన నూతన లైబ్రరీ

అనాథ సదన్ కాదు..
అధునాతన సదన్

● ఉన్నత విద్యలో రాణిస్తున్న సదన్ విద్యార్థులు ● రాబోయే రోజుల్లో సివిల్స్‌లో రాణించాలని జిల్లా కలెక్టర్ సూచన
● సదన్ ఆవరణలో కూరగాయలు పండిస్తూ తమ అవసరాలు తీర్చుకుంటున్న అనాథ విద్యార్థులు

డిచ్‌పల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆ సదన్‌లోని చిన్నారులు వారు ఎక్కడ పుట్టారో వారికే తెలియదు... వారి తలిదండ్రులు ఎవరో కూడా వారికి గుర్తెరగరు. కానీ ఆ ఆశ్రమమే అన్ని తానై వ్యవహరిస్తుంది అదే డిచ్‌పల్లి మానవతా సదన్ చిన్నారుల ఆశ్రమం. గతంలో జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన ఐఏఎస్ అధికారి యోగితా రాణానే (ప్రస్తుత విద్యాశాఖ కార్యదర్శి) ఆ చిన్నారులకు అమ్మగా మారింది. గతంలో నిజామా బాద్ కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో ఆమె ఆనాథ చిన్నారుల కోసం ఈ మానవతా సదన్‌ను ఏర్పాటు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఏర్పాటు చేయించారు. ఏర్పాటు చేయించడమే కాదు ఆమె జిల్లా నుంచి బదిలీపై వెళ్లిన ఇప్పటికి సదన్‌కు వస్తూ పిల్లల బాగోగులు చూసుకుంటారు. గత పదేళ్ల క్రితం ప్రారంభమైన ఈ సదన్ ప్రస్తుతం 152 మంది విద్యార్థులు ఉంటూ చదువుకుంటున్నారు. ఈ ఆశ్రమంలో ఉండి చదువుకొని చాలా మంది ప్రస్తుతం ఉన్నత విద్యలో రాణిస్తున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో 6గురు, బీఎస్సీ అగ్రికల్చర్ (ఎన్‌జీ రంగా వర్సిటీ)లో ఇద్దరు, పాలిటెక్నిక్ 14, నిర్మల్ వైద్య కళాశాల ఒకరు, బాన్సువాడ బీఎస్సీ కళాశాలలో ఇద్దరు, ఒకేషనల్ కోర్సులో ఒక్కరు రాణిస్తున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఈ విద్యార్థుల చదువు విషయాలు తెలుసుకొని సంభ్రమాశ్చర్యానికి గురియ్యారు. సదన్‌లోని విద్యార్థులు మంచిగా చదివి సివిల్స్‌లో సైతం రాణించాలని ఆయన ఆకాంక్షించారు. సదన్‌కు ఎటు వంటి అవసరలు ఉన్న తన దృష్టికి తీసుకరావలని ఆయన కోరారు. ఇప్పటికే సదన్‌లోని విద్యార్థులకు అనేక రకాల మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నారు. అందుకు అనుగుణంగా లైబ్రరీతో పాటు, నూతన మరుగుదోడ్లు, ముత్ర శాలలు నిర్మించారు. విద్యార్థులకు కూరగాయలు పండిస్తు తమ అవసరాలను వారే తీర్చుకుంటున్నారు. ఆనాథ చిన్నారులమని భావ వ్యక్తీకరణ రాకుండా ఇక్కడి అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ లు వారి అవసరాలను తీరుస్తున్నారు. జిల్లా కలెక్టర్‌గా ఎవరు ఉన్నా వారే ఈ ఆశ్రమ చిన్నారులకు పెద్ద దిక్కుగా ఉంటూ ముందుకు తీసుకెళ్తుండటం గమనించదగ్గ విషయం.



నూతనంగా నిర్మించిన మూత్రశాలలు, మరుగుదొడ్లు



సదన్ ఆవరణలో సాగు చేస్తున్న కూరగాయలు





కలెక్టర్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఉన్నతాధికారుల సహకారం మరువలేనిది

● సదన్ ఇన్‌చార్జ్ కె.రమేశ్



మానవతా సదన్ ఈ స్థాయిలో నిలబడి ముందుకు సాగుతుందంటే ఉన్నతాధికారుల చొరవతోనే సాధ్యమవుతుందని వారి సహకారం మరువలేనిది. నాటి జిల్లా కలెక్టర్ యోగితా రాణా నుంచి నేటి జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వరకు వారి సహకారం మరువలేనిది. ఆశ్రమ నిర్వహణకు ఎటువంటి సహకారం కావలన్న తక్షణమే తీర్చడంతోనే పిల్లలు ఉన్నత విద్యలో రాణిస్తున్నారు.

కనీస వసతులు ఎక్కడ!?

● ఉపాధి కూలీల శ్రమ దోపిడి ● పని ప్రాంతాల్లో నీరు, నీడలేక కూలీల ఇబ్బందులు ● పట్టించుకోని అధికారులు

మోస్రా, మే 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు మండలంలోని చింతకుంట, తిమ్మాపూర్, గోవూర్ గ్రామాల్లో ఉపాధి కూలీ పనులు కొనసాగుతున్నాయి. ఇట్టి విషయంపై కూతఈ పని చేస్తున్న వారిని అడిగి వివరాలు తెలుసుకోగా శ్రామికుల శ్రమదోడిపి ఉదయం 7గంటల నుంచి 12గంటల వరకు ఐదు గంటల వరకు పని చేయాల్సి వస్తుంది. కాని మాకు కూలీ కింద 307 రూపాయలు మాత్రమే ఇస్తున్నారు. అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● కనీస వసతులు కరువు

మండు ఎండలో పని చేస్తుండగా కూలీలపై చిన్న చూపు చూస్తున్న అధికారులు తాగడానికి మంచినీళ్ల సౌకర్యం లేదు. నీడలో కొద్దిగా సేద తీరేందుకు టెంటు ఏర్పాటు చేయ్యట్లేదు. రెక్కాడితే గాని పొట్ట నిండని బతుకులకు ఎన్ని రకాల ఇబ్బందులు పెడుతున్నారు. అని ఉపాధి శ్రామికులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





మండే ఎండలో పని చేస్తున్న కూలీలు



ఎండలో పనిచేస్తున్న కూలీలు

ఉపాధి కూలీలకు టెంట్ ఏర్పాటు చేయాలి ..



ఉపాధి కూలీలకు ఇబ్బంది లేకుండా తాగునీరు. నీడ కోసం టెంట్ గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఏర్పాటు చేయాలి. వాటికి సంబంధిత ఖర్చు బిల్లులు పెట్టుకునే అవకాశం ఉన్నది. వారి ఖర్చులు వస్తాయి. ఇదిలా ఉండగా మండలంలోని చే నెంబర్ తండా దుబ్బలో ఉపాధి పనులు ప్రారంభించలేదు. ఇందుకు మండల అభివృద్ధి అధికారికి తెలియపర్చగా సంబంధిత కార్యదర్శికి పనులు ప్రారంభించాలని చెప్పగా పట్టించుకోకపోతే మెమో ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

ఇన్‌చార్జి ఏపీవో అంబర్ సింగ్

చెరువు మట్టి.. చేనుకు బలం!

మద్నూర్, మే 8 (ఆంధ్రజ్యోతి) : చెరువు మట్టి చేనుకు బలాన్ని ఇస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వేసవిలో చెరువు నీరు ఎండిపోయినప్పుడు చెరువులోని నల్ల మట్టి తీసి రైతులు తాము సాగు చేసే భూముల్లో వేసుకుంటే అనేక ప్రయోజనాలు ఉన్నాయని రైతులకు శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వర్షాలు పడినప్పుడు అనేక పోషక విలువలు కలిగిన సారవంతమైన మట్టి చెరువులోకి వచ్చి చేరుతుంది.

● చెరువుల్లో పెరగనున్న నీటి నిల్వలు

చెరువుల్లో పూడిక తీయడం ద్వారా నీటి నిల్వలు పెరుగుతాయి. ఎక్కువగా నీరు నిలిచే అవకాశం ఉంటుంది. చెరువు మట్టిని భూముల్లో వేయడం ద్వారా నేల సారవంతం అవుతుంది. చెరువు మట్టిలో ఎక్కువగా ఉండే పోషకాల వల్ల నత్రజని ఎక్కువగా అందుతుంది. చెరువు మట్టిని పంట చేనులో వేయడం ద్వారా పంటలు అధిక దిగుబడి సాధించవచ్చు, వేసవికాలంలో రైతులు చెరువు పూడిక మట్టిని పంట చేనుల్లో వేసుకోవడం ద్వారా భూసారం పెరుగుతుంది, రైతులు వేసవి దుక్కులు దున్నే తప్పుడు ఆరు నుంచి ఏడు అంగుళాల పైన నేల దున్నినట్లయితే భూసారం పెరుగుతుంది. పంట దిగుబడి అధికంగా ఉంటుంది. మట్టితో పాటు సేంద్రీయ ఎరువు కలిపి వేసుకుంటే రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు. మొక్కలు ఆరోగ్యంగా ఏపుగా పెరుగుతాయి, కలుపు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే శక్తిని నేలకు ఉంటుంది. దిగుబడి పెరిగి రైతులకు ఆదాయం వస్తుంది. నేల సారవంతమై అధిక దిగుబడినిస్తుంది.



చెరువులోని నల్ల మట్టి కుప్పలుగా చేసిన రైతులు

మెండోరాలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన

భీమ్‌గల్ రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): మెండోర గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసాయి మందిరంలో గురువారం వేదపండితులతో సాయిబాబా విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేశారు. విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం బాబాకు అభిషేకం, పూర్ణాహుతి, మంత్రపుష్పం, సమర్పణ, దీపారాధన, పుణ్యాహవచనం, నవగ్రహ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మందిరంలో బాబా విగ్రహంతో పాటు గణపతి, శివలింగం, దత్తాత్రేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితుడు ప్రవీణ్‌శర్మ బృందంతో పాటు గ్రామ పురోహితులు నరేందర్, ప్రకాష్‌శర్మ, గ్రామ కమిటి అధ్యక్షుడు గౌరు రాజన్న, ఉపాధ్యక్షుడు సాయిబాబా, కోశాధికారి గాజరి గంగారెడ్డి, రమేష్, ఆరే రవీందర్, మాజీ సర్పంచ్ రాజేందర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మెండోరలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన

వేగంగా సాగుతున్న ధాన్యం కొనుగోళ్లు

● నాగిరెడ్డిపేటలో లక్షా 44 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు

నాగిరెడ్డిపేట, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా సాగుతోంది. మండలంలోని వివిధ గ్రామాల్లో ఐకేపీ, సొసైటీల ఆధ్వర్యంలో 24 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 2,558 మంది రైతుల నుంచి ఒక లక్షా 44 వేల 769 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. తాండూర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏడు కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 1131 మంది రైతుల నుంచి 66,048 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సొసైటీ సీఈవో మురళీ తెలిపారు. మాల్తుమ్మెద సొసైటీ ఆధ్వర్యంలో ఆరు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 607 మంది రైతుల నుంచి 33,341 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సీఈవో సందీప్ తెలిపారు. అలాగే ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 11 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 820 మంది రైతుల నుంచి 45,380 క్వింటాళ్ళ వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఐకేపీ ఏపీఎం జగదీష్‌కుమార్ తెలిపారు. మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగ వంతంగా నిర్వహిస్తున్నారు.

● ఎండ తీవ్రతతో ఉదయం, సాయంత్రం వేళల్లో ధాన్యం సేకరణ

ఎండలు దంచి కొడుతుండటంతో ఎండ తీవ్రత అత్యధికంగా ఉండడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లోనే ధాన్యం సేకరణ సాగుతుంది. ఉదయం ఏడు గంటలకే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనులను ప్రారంభిస్తున్నారు. ఉదయమే హమాలీలు, కేంద్రాల నిర్వహకులు, రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చేసి ధాన్యం తూకం వేయడం, లారీలో ధాన్యం బస్తాలు లోడ్ చేయడం తదితర పనులు జరుపుతున్నారు. ఎండ తీవ్రత కాగానే పనులను నిలిపివేసి తిరిగి సాయంత్రం వాతావరణం చల్లబడ్డాక పనులు చేపడుతున్నారు. రాత్రి 7, 8 గంటల వరకు పనులను కొనసాగిస్తున్నారు. మండలంలో ధాన్యం సేకరణ జోరుగా సాగుతోంది.



చీనూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని లారీలో లోడ్ చేస్తున్న దృశ్యం



ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేసేందుకు తీసుకెళుతున్న హమాలీలు

భారత సైన్యాన్ని అభినందిస్తున్న ప్రపంచ దేశాలు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్



సుద్దపల్లిలో మాట్లాడుతున్న జిల్లా బీజేపీ అధ్యక్షుడు దినేశ్‌పటేల్

డిచ్‌పల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): పహేల్గాం పర్యటక ప్రాంతంలో అమాయక భారత టూరిస్టులను పాకిస్థాన్ ఉగ్రవాదులు కాల్చి చంపడం పిరికి పంద చర్య అని ఘటన జరిగిన రెండు వారాల్లోనే భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ ఏర్పాటు చేయడం భారత సైన్యం ధైర్యశాలికి నిదర్శనమని ఈ సందర్భంగా భారత ప్రజలు సైన్యానికి అండగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులచారి అన్నారు. గురువారం ఆయన సుద్దపల్లిలో స్థానిక విలేకర్లతో పత్రిక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సామాన్యుల జోలికివెళ్లకుండా కేవలం పాకిస్థాన్ ఉగ్రవాదుల స్థావ రాలపై భారత సైన్యం దాడి ప్రధాని మోదీ నిర్ణయం తీరు ప్రపంచ దేశా లు అభినందిస్తున్నయని ఆయన అన్నారు. ఉగ్రవాదంతో ఏ దేశం అభివృద్ధి చెందదని పహేల్గాం దాడి పాకిస్థాన్ పిరికిపంద చర్య అని దినేశ్ విమ ర్శించారు. ఈ విలేకర్ల సమావేశంలో బీజేపీ నాయకులు, చంద్రకాంత్, బీజేవైఎం నాయకులు సతీశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం

నవీపేట,మే8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అశాజ్యోతి కాలనీలో గత నెల 25న అదే గ్రామానికి చెందిన సుమారు 58 సంవత్సరాల వ్యక్తి మృతి చెందగా అతని మృతదేహానికి కుటుంబ సభ్యులు, బంధువులు ఖననం చేశారు. గురువారం సంబంధిత మృతదేహన్ని బయటకు తీయించి అక్కడే వైద్యులచే పోస్టుమార్టం నిర్వహించడం జరిగిందని ఎస్సై వినయ్ తెలిపారు. 08-04-2025రోజున అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో జరిగిన గొడవలో సంబంధిత వ్యక్తి దాడి చేయడంతో తన తండ్రిగాయపడి మృతి చెందాడని మృతుడి చిన్న కుమారుడు బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని గురువారం ఖననం చేసిన వ్యక్తి మృతదేహన్ని బయటకు తీసి వైద్య సిబ్బందిచే అక్కడే పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. తహసీల్దార్ వెంకట రమణ పంచనామా నిర్వహించారని ఎస్ఐ పేర్కొన్నారు. పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా తదుపరి దర్యాప్తు చేయడం జరుగుతుందని ఎస్సై పేర్కొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘ నాయకులు

నిజామాబాద్ కల్చరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వ త్రిక సమ్మెను విజయవంతం చేయాలని టీయుసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్య అన్నారు. నగరంలోని కోటగల్లిలో ఉన్న శ్రామిక భవన్‌లో గురువారం జరిగిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఎన్డీయే 11సంవత్సరాల పాలనలో కార్మికుల జీవన ప్రమాణాలు పడిపోయాయన్నారు. అన్నిరకాల వస్తువుల ధరలు పెరిగాయన్నారు. కార్మికుల వేతనాలు మాత్రం పెరగడం లేదన్నారు. కార్మికులకు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కరువైందన్నారు. కార్మికులకు కనీస వేతనాల అమలు, కనీస పెన్షన్ల అమలు కోసం ఈ సమ్మె చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.నరేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న, రాజేశ్వర్, లక్ష్మణ్, సాయన్న, రెహన, రాజేశ్వర్, కిరణ్, లింగం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కి సన్మానం

ఆర్మూర్‌టౌన్,మే8 (ఆంధ్రజ్యోతి):ఈరోజు హైదరాబాద్‌లోని సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ మరియు రోడ్డు రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినాన్ని పురస్కరించుకొని వారికి ఆత్మీయ శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు.ఈకార్యక్రమంలో పీసీసీ మాజీ కార్యదర్శి ఖాందేష్ శ్రీనివాస్,లయక్లబ్ ఆఫ్ ఆర్మూర్ గ్రీన్ చాప్టర్ ప్రెసిడెండ్ లయన్స్ నివేదన్ గుజరాతీ ఎంజెఎఫ్ ప్రముఖ వ్యాపారి గుజరాతీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రిని సన్మానిస్తున్న పీసీసీ మాజీ కార్యదర్శి ఖాందేష్ శ్రీనివాస్

తాటిపత్రీల వితరణ

ముప్కాల్, మే8 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండలంలోని వేంపల్లి గ్రామంలో నాయకుడు సంతోష్ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో సన్నకారు రైతులకు ఉచిత తాటిపత్రీలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులు నాయకుడు సంతోష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకుడు సంతోష్ ఫౌండేషన్ సభ్యులు రాకేష్, ముత్యం, శ్రీనివాస్, శేఖర్, భరత్ రైతులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ వంతెన నిర్మాణానికి నిధుల మంజూరు



పీఎం, కేంద్ర మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

డిచ్‌పల్లి, మే 8(ఆంధ్రజ్యోతి):డిచ్‌పల్లి 44వ జాతీయ రహదారి సుద్దపల్లి సీఎంసీ జంక్షన్ వద్ద అండర్ పాస్ వంతెన ఏర్పాటు కు కేంద్ర ప్రభుత్వం 38కోట్లు నిధులు మంజూరు చేయడంతో గురువారం సీఎంసీ జంక్షన్ వద్ద బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, కిషన్ రెడ్డి , ఎంపీ అర్వింద్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులచారి చిత్రపటాలకు బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు.ఈసందర్భంగా బీజేపీ నాయకులు మాట్లా డుతూ.. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అనేక మంది ప్రాణాలు కోల్పోయారని వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు కావడంతో డిచ్‌పల్లి, ధర్పల్లి, జక్రాన్‌పల్లి, మండలాల పరిధిలోని 20గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యం ఏర్పాడు తుందన్నారు. రోడ్డు ప్రమాదాల తీవ్రత గుర్తించి నిధులు మంజూరు చేసినందుకు భాజపా నాయకులు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు చంద్రకాంత్, మాజీ వైస్ ఎంపీపీ శ్యాంరావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి, నాయకులు వినోద్, లక్ష్మణ్, పాల్గొన్నారు.

లైసెన్స్ ల్యాండ్ సర్వేయర్ల శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

● కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్,మే8(ఆంధ్రజ్యోతి): లైసెన్స్ ల్యాండ్ సర్వేయర్ల శిక్షణ కోసం ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు మీ-సేవ కేంద్రాల్లో ఈ నెల 17వ తేదీ లోపు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా భూమి సర్వే, భూమి రిజిస్ట్రేషన్ కోసం వెళ్లే ప్రతీ దరఖాస్తుదారుడు సీఎస్ఎస్ఎల్ఆర్ ద్వారా తెలియజేయబడిన తేదీ నుంచి సర్వే/సబ్ డివిజన్ మ్యాప్‌ను కూడా సమర్పించాల్సి ఉంటుందన్నారు. సర్వే ల్యాండ్ రికార్డ్స్ విభాగంలో అర్హత కలిగిన సరిపడా లేనందున 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర వ్యాప్తంగా 5వేల మంది లైసెన్స్ సర్వేయర్లను అర్హత ప్రాతిపదికన ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. లైసెన్స్ సర్వేయర్ల ఎంపికైన వారు నెలకు సుమారు రూ.30వేలకు పైగా ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ సూచించారు. లైసెన్స్ సర్వేయర్‌గా ఎంపికైన వారికి జిల్లా కేంద్రంలో ఈ నెల 26 నుంచి జులై 26 వరకు రెండు నెలల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ ముగింపులో పరీక్ష ఉంటుందని, ఈ పరీక్షలో థియరీ, ప్లాటింగ్ అండ్ ప్రాక్టికల్ అనే మూడు భాగాలు ఉంటాయన్నారు. పరీక్షలోని ప్రతీ విభాగంలో 60శాతం ఉత్తీర్ణత సాధించి మొత్తం మూడు పేపర్లలో 70 శాతానికి తక్కువ కాకుండా ఉండాలని తెలిపారు. శిక్షణ పొంది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినర వారు ప్రభుత్వ సర్వేయర్ కింద 40పని దినాల పాటు శిక్షణ కార్యక్రమంలో భాగంగా అప్రెంటిస్‌షిప్ చేయాల్సి ఉంటుందని కలెక్టర్ సూచించారు. అప్రెంటిస్‌షిప్ శిక్షణ పూర్తయిన తరువాత లైసెన్సు పొందడానికి డిపార్ట్‌మెంటు నిర్వహించే అసెస్‌మెంట్ టెస్టులో అభ్యర్థులు ఉత్తీర్ణులు కావాలన్నారు. అసెస్‌మెంటులో ఉత్తీర్ణత సాధించిన తర్వాత అభ్యర్థికి లైసెన్సు ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ కోసం దరఖాస్తు చేసుకునే వారు 17-05-2025 నాటికి ఓ.సీ.,బీ.సీ.లు అయితే 18 నుండి 35 సంవత్సరాల లోపువయస్సు కలిగి ఉండాలని, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు 18 నుంచి 40 సంవత్సరాల లోపు వయసు కలిగినవారు అర్హులన్నారు. ఇంటర్మీడియట్ గణితం సబ్జెక్టు కలిపి 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత లేదా డ్రాఫ్ట్‌మెన్ (సివిల్) ట్రేడ్‌లో ఎన్.సీ.వీ.టీ సర్టిఫికేట్, సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ తెలంగాణ, తత్సమానం నిర్వహించిన ఎస్.ఎస్.సీ పరీక్షల్లో ఉత్తీర్ణత, లేదా తెలంగాణ ప్రభుత్వం గుర్తించిన సంస్థ నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా లేదా డిగ్రీ ఉండాలని లేదా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ బోర్డ్ ఆఫ్ సర్వేయర్ మరియు ఎస్టిమేటర్ కోసం వృత్తి కోర్సులో ఉత్తీర్ణత, భారతదేశంలోని సర్వేయర్ల సంస్థ నిర్వహించే ల్యాండ్ సర్వేయింగ్‌లో ఇంటర్మీడియట్ లేదా చివరి పరీక్షలో ఉత్తీర్ణత సాధించినవారు అర్హులన్నారు. లైసెన్సు సర్వేయర్ల శిక్షణ కోసం ఓసీ, అభ్యర్థులు 10వేలు, బీసీలు 5వేలు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు రూ.2వేల 5వందల రుసుము చెల్లించాలన్నారు. శిక్షణ కోసం మీ-సేవలో దరఖాస్తు ఫారంతో పాటు మీ విద్యార్హతల కాపీలను జత చేయాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 17వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

సిద్దాపూర్‌లో రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ శరత్

బోధన్‌రూరల్,మే8(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని సిద్దాపూర్ గ్రామంలోని రైతు వేదికలో కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూరు వారి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అనుబంధంతో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కృషి విజ్ఞాన కేంద్రంలోని శాస్త్రవేత్తలు రైతులు తక్కువ యూరియా వాడి సాగు ఖర్చు తగ్గించడం, అవసరం మేరకు రసాయనాలను వినియోగించి నేల ఆరోగ్య కాపాడడం, రసీదులను భద్రపరిచి కష్టకాలంలో నష్టపరిహారాన్ని పొందడం, సాగునీటిని ఆదా చేయడం, పంట మార్పిడి పాటించి ఆదాయాన్ని పొందడం చెట్లను పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడడం వంటి అంశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ శరత్ మాట్లాడుతూ రైతు ముగింట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం గ్రామ రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విశ్వవిద్యాలయం వారు రూపొందించిన రనూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అవలంబిస్తూ సాగు ఖర్చులను తగ్గించుకుని అధిక దిగుబడులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అలీం హైమద్, బోధన్ వ్యవసాయ అధికారి సంతోష్, శాస్త్రవేత్తలు స్వప్న, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి చేయూత నివ్వండి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి జీవీఎన్ భరతలక్ష్మీ

నిజామాబాద్ లీగల్,మే8(ఆంధ్రజ్యోతి):జిల్లా వ్యాప్తంగా జూన్ మాసంలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ చేయూత నివ్వాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ జి.వి.ఎన్ భరతలక్ష్మీ కోరారు.జిల్లాకోర్టు ప్రాంగణంలోని సమావేశపు హాల్‌లో అదనపు జిల్లా న్యాయాధికారి హరీష, న్యాయసేవ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఉదయ భాస్కర్ రావులతో కలిసి బీమా కంపెనీల స్టాండింగ్ కౌన్సిల్,అధికారులు, న్యాయ వాదులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె ప్రసంగిం చారు.మోటారు రోడ్డు ప్రమాద నష్ట పరిహార దావాలను లోక్ అదాల త్‌లో బీమా కంపెనీలు, న్యాయవాదులు ఒక రాజీ పరిష్కారం దిశగా అడుగులు వేస్తే, న్యాయస్థానాలు సహకరించి,సలహాలిచ్చి నష్టపరిహార దావాలను తుదిరూపం తీసుకోవడానికి చేదోడుగా నిలుస్తామని ఆమె అన్నారు.లోక్ అదాలత్‌లో రాజీపద్ధతిన అవార్డులు అందుకున్న దావాలలో బీమా కంపెనీలు త్వరితగతిన నష్టపరిహార డబ్బులను కోర్టులో డిపాజిట్ చేస్తాయని తెలిపారు. అట్టి డబ్బు మోటారు వాహన ప్రమాదంలోని బాధితులకు చేరుతుందని,అది వారి ఆర్థిక అవసరాలకు పనికి వస్తుందని పేర్కొన్నారు. ముందస్తుగా కేసులను పరిష్కరించు కుంటే బీమా సంస్థలకు ఆర్థిక లబ్ధి కూడా చేకూరుతుందని ఆమె తెలిపారు. బాధిత కుటుంబాల ఆర్థిక నిరీక్షణను అంతం చేసిన వారం కాగలమని జిల్లా న్యాయాధికారి తెలిపారు. జూన్‌లో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను నడిపించేది, నడక చూపించేది న్యాయాధికారులు, న్యాయవాదులేనని ఆమె అన్నారు. ప్రభుత్వ, ప్రైయివేటు రంగ బీమా కంపెనీలు కలిసి కట్టుగా వస్తే పరిష్కారం కానిదేముందని ఆమె అభివ ర్ణించారు. బీమా కంపెనీల న్యాయవాదులు, నష్టపరిహార దావాలోని న్యాయవా దులు, బీమా కంపెనీల అధికారులు ఒకఅంగీకారానికి వస్తే, న్యాయాధికారు లు చేదోడు వాదోడుగా నిలుస్తారని ఆమె వెల్లడించారు.సమావేశంలో ప్రభుత్వ బీమా కంపెనీల న్యాయవాదులు మంచికట్ల గోవర్ధన్, ఆనంద్ రెడ్డి, అంకిత, గణేశ్ దేశాండే, ఎం.వి.నరసింహ రావు,వి. భాస్కర్, మోహన్, సదానంద్ గౌడ్, న్యాయవాదులు రఘువీర్ భూ పాల్, అల్గోట్ రవీందర్, మహేష్,ముత్యాల కృష్ణారెడ్డి, పిట్లం శ్రీనివాస్ తది తరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆరోపణలు సరైనవి కాదు: మానాల

● రాష్ట్రసహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల



కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

కమ్మర్‌పల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): బాల్కొండ ఎమ్మెల్యే మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన ఆరోపణలుసరైనవి కాదని రాష్ట్ర సహకార యూ నియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి మండల పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోరాష్ట్రం ఆర్థికంగా దివాళాచేశారు. మిగులు బడ్జెట్‌లో ఉన్నరాష్ట్రాన్ని అప్పులరాష్ట్రంగా మార్చింది మీ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. ప్రశాంత్‌రెడ్డి ఎప్పుడు మాట్లాడిన ప్రభుత్వాన్ని విమర్శించడం తప్ప రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇచ్చింది లేదని అన్నారు. బీఆర్ఎస్ హ యాంలో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు, ఆర్థిక వ్యవస్థ విచ్చిన్నం చేస్తూ అధి కారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి దీన్ని సరిచేసుకుంటూ..ముందుకు వెళ్తున్న క్రమంలో ప్రశాంత్‌రెడ్డికి వత్తాసుపలికే కొందరు ఉద్యోగులు ప్రభుత్వంపై ఒత్తితెస్తే తీసుకువచ్చారన్నారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగులును గేటుబయట నిల్చో బెడితే ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగులతో మూడు నుంచి నాలుగు సార్లు చర్చలు జరిపిన విషయాన్ని గుర్తు చేశారు. తప్పుడు మాటలతోప్రజలను మభ్యపెట్టాలని చూస్తూ గ్రామాలలో తిరనీయకుండా అడ్డుకుంటామని అన్నారు.ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం ఏ విషయంలో విఫలమయ్యిందో చెప్పాలని అందుకు తాము చర్చలకు సిద్ధమన్నారు. పదేళ్ల అధికారంలో రాజభోగాలు అనుభవించిన ప్రశాంత్ రెడ్డి ఇప్పుడు గ్రామాల్లోకి వెలితే ఎవరు పట్టించుకోవడం లేదన్న అక్కసుతో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన చర్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. పదేళ్ల మీ అభివృద్ధి 17 నెలల మా అభివృద్ధిపై తాము చర్చకు సిద్ధమన్నారు. సమాశంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణురాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అడెపు గంగాప్రసాద్ కిషాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగెల ప్రవీన్, బుచ్చిమల్లయ్య, సుంకెట శ్రీనివాస్, గణేష్ గుప్త, జగదీశ్ , శేఖర్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

టీయూలో మంత్రి పొన్నం జన్మదిన వేడుకలు



టీయూలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

డిచ్‌పల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు గురువారం తెలంగాణ యూనివర్సిటీలో టీపీసీసీ సెక్రటరీ రామ్‌గోపాల్ రిసార్చ్ స్కాలర్ పుప్పల రవి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ధర్మగౌడ్, పట్టన కాంగ్రెస్ కార్యదర్శి నరేందర్ సింగ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు లక్ష్మణ్, శివప్రసాద్, అనిల్, రాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పడిగెలలో సమ్మర్ వెకేషన్ సండే స్కూల్ ప్రారంభం

వేల్పూర్ , మే8 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పడిగెల గ్రామంలో సీఎస్ఐ చర్చిలో సమ్మర్ వెకేషనల్ సండే స్కూల్ ప్రోగ్రాం గురువారం పాస్టర్ ప్రేమ్‌రాజ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను వేసవికాలంలో ఎండలో తిప్పకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతీ సంవత్సరం వేసవికాలం క్యాంపుని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సండే స్కూల్ డైరెక్టర్ మేషక్, తబిత, సెక్రటరీ రాహుల్ టీచర్స్ ప్రభావతి, లావణ్య, వర్ష, వాలీటర్స్ అమూల్య, అఖిల, లలిత, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు11 సెల్‌ఫోన్ల అందజేత

బోధన్‌రూరల్,మే8(ఆంధ్రజ్యోతి): బోధన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 11సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి ఫోన్‌ల యాజమానులకు అప్పగించడం జరిగిందని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

● రాష్ట్ర మంత్రి సీతక్క



చెక్కును అందజేస్తున్న మంత్రి సీతక్క

నిజామాబాద్ అర్బన్,మే8(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అన్ని రంగాలలో రాణించాలని మంత్రి సీతక్క అన్నారు. గురువారం రాష్ట్రస్థాయిలో జరిగిన వార్షిక రుణ ప్రణాళిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లోన్‌లనందు రాష్ట్రస్థాయిలో అత్యధిక రుణాలను ఇచ్చిన విభాగంలో నిజామాబాద్ జిల్లాకు అవార్డు రావడం జరిగిందన్నారు. ఈ అవార్డును డీఆర్‌డీవో, అదనపు డీఆర్‌డీవో, జడ్ఎస్ అధ్యక్షులు, డీపీఎం ఎఫ్, సీఈవో, ఏసీఆర్‌పీ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్ చైర్ల పంపిణీ



దివ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేస్తున్న రమణా రెడ్డి తదితరులు

నిజామాబాద్ అర్బన్,మే8(ఆంధ్రజ్యోతి): నగరంలోని మారుతి నగర్‌లో స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్ నిజామాబాద్ ఆధ్వర్యంలో సెరిబ్రల్ పాలసీ దివ్యాంగులకు గురువారం వీల్ చైర్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లోక రమణ్ రెడ్డి, జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడుపాల్గొని ప్రసంగించారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి సమాజంలో మనం ఎంతసేపు మన గురించే ఆలోచిస్తున్నామని, మహా అంటే మన కుటుంబం గురించి ఆలోచిస్తామని, కానీ పక్క వాళ్ల అవసరాలు మరియు కష్టాల గురించి చాలా తక్కువ మంది ఆలోచించి వారి కష్టాలకు స్పందించి సేవలందిస్తారని, అలాంటి మహనీయులకు అభినందనలు తెలిపారు. స్నేహ సొసైటీ మరియు రోటరీ క్లబ్ లాంటి సంస్థలు కష్టాల్లో మరియు ఇబ్బందుల్లో వ్యక్తులను, దివ్యాంగులను గుర్తించి వారికి అవసరమైన సేవ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ జేమ్స్ నిజామాబాద్ అధ్యక్షుడు పద్మ శ్రీనివాస్, స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్ సిద్దయ్య, రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్ నిజామాబాద్ కార్యదర్శి గౌరీ శంకర్, స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి, రోటరీ క్లబ్ జేమ్స్ వ్యవస్థాపకుడు రంజిత్ సింగ్ చౌహాన్, రొటేరియన్ చంద్రశేఖర్, దివ్యాంగులు వారి తల్లిదండ్రులు మరియు సిబ్బంది ఉన్నారు.

నవీపేట జీపీని తనిఖీ చేసిన డీఎల్‌పీవో

నవీపేట,మే8(ఆంధ్రజ్యోతి): నవీపేట మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని గురువారం నిజామాబాద్ డీఎల్‌పీవో శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. నవీపేటలో ప్రతి శనివారం జరిగే మేకల సంతకు సంబంధించిన స్థలం సరిపోవడం లేదని ఇటీవల పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామమంలో మేకల సంత నిర్వహణకు ప్రత్యామ్నాయ స్థలాల గురించి ఆయన వాకబు చేశారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్ తదితరులున్నారు.

ఓయూ నుంచి పీహెచ్‌డీ అందుకున్న కృష్ణారెడ్డి

నిజామాబాద్ అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి నిజామాబాద్‌కు చెందిన సి. కృష్ణారెడ్డి పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. ప్రొఫెసర్ బి.మంగు, హెడ్ ఆఫ్‌ది డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ సతీష్, బోర్డ్ ఆఫ్‌స్టడీస్ ప్రొఫెసర్ బి. మల్లేష్ ఆధ్వర్యంలో ఈపిహెచ్‌డి అవార్డును తీసుకున్నారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో ఆయన డిటెక్షన్ అండ్ క్లాసిఫికేషన్ ఆఫ్ పవర్ క్వాలిటీ, డిస్టర్బెన్స్‌త్రూ మిషిన్‌లర్నింగ్ అనే అంశంపైన ఆయన ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాలలో ఈ పీహెచ్‌డిని పూర్తిచేశారు. ఎలక్ట్రికల్ ఇంజ నీరింగ్‌లో పీహెచ్‌డి పూర్తిచేసిన ఆయనను పలువురు అభినందించారు.



పీహెచ్‌డీ పట్టాను అందుకుంటున్న కృష్ణారెడ్డి

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.130	రూ.240	రూ. 260
వెన్‌కాబ్(కిలో)	: రూ.140	రూ.250	రూ. 270

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.98,500	రూ.90,927	రూ.1010

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 షిన్‌చాన్ అవర్ డైనోసార్ డైరీ (తెలుగు) (11.20)
సింగిల్ (తెలుగు) (1.40,7.25,10.10)
రైడ్-2(హిందీ)(4.25)
స్క్రీన్-2 : తుదురం(తెలుగు) (11.20)
: శుభం (తెలుగు) (2.40, 5.20,8.00, 10.40)
స్క్రీన్-3 : 6జర్నీ (తెలుగు) (11.00)
రైడ్-2(హిందీ) (1.45)
హిట్-3(తెలుగు) (4.45,10.25)
కలియుగం2064(8.00)
స్క్రీన్-4 : కామన్‌మ్యాన్‌పిల్లాం(తెలుగు) (11.40)
: జగదేకవీరుడు అతిలోక సుందరి(రీరిలీజ్) (తెలుగు) (2.30)
బ్లైండ్ స్పాట్(తెలుగు)(5.40)
:రైడ్-2 (హిందీ) (7.45)
తుదురం (10.45)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : సింగిల్(తెలుగు) (11.00, 4.40)
: హిట్-3(తెలుగు) (1.30,7.30)
: జగదేకవీరుడు అతిలోక సుందరి (రీరిలీజ్) తెలుగు (10.30)
స్క్రీన్-2 : సింగిల్ (తెలుగు) (1.30, :7.30,10.30)
: రెట్రో (1.30, 7.20)
స్క్రీన్-3 : జగదేకవీరుడు అతిలోక సుందరి(రీరిలీజ్) తెలుగు (11.00,4.30)
: శుభం(తెలుగు) 1.40,7.20, 1020)

లలితామహల్ : రెట్రో (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : తండర్ బోల్ట్స్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : రైడ్-2 (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : హిట్-3 (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్